## క్లుప్తంగా

### ఘనంగా పైడితల్లి అమ్మవారి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని స్థానిక చదురుగుడి ఆవరణలో వేద పండితులు శాస్త్రోక్తంగా పైడితల్లి అమ్మవారు చండీయాగం నిర్వహించారు. వేద పండితులు చండీయాగం విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి



భారతరత్న సుబ్బలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవి, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక కొత్త అగ్రహారంలో ఉన్న రోటరీ దళిగి పేరాజు మ్యూజిక్ అకాడమీలో భారతరత్న ఎం.ఎస్.సుబ్బలక్ష్మి 109వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అకాడమీ ప్రిన్సిపాల్ మండపాక రవి సుబ్బలక్ష్మి జీవిత విశేషాలను వివరించారు. దేశ విదేశాల్లో అనేక కచేరీలు చేసిన ప్రముఖుల మన్ననలను పొంది, అనేక మంది శిష్యులను తయారు చేశారన్నారు. నిత్యం మనం వింటున్న వేంకటేశ్వర స్వామి సుప్రభాతం, విష్ణు సహస్రనామ స్తోత్రం అనేక భాషలలో కృతులు, కీర్తనలను ఆలపించి, భారత ప్రభుత్వ అత్యున్నత పురస్కారం భారతరత్నను అందుకున్నారన్నారు. కార్యక్రమంలో సభ్యులు శారద, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూ జీవీ విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు అందజేత



ల్యాప్‌టప్‌లు పొందిన విద్యార్థులతో యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 15 మంది విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు, బ్యాగులు ఉచితంగా అందజేశారు. హిటాచ్ సంస్థ సహకారంతో విజయనగరం శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ విద్యార్థినులు 9 మంది, అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆరుగురు విద్యార్థినులు లబ్ధిదారులుగా అందుకున్నారు. ఇంజినీరింగ్ చదువులో అమ్మాయిలు తక్కువగా ఉన్నందున వారికి పోత్రహించాలన్న లక్ష్యంతో ఈ పంపిణీ చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, హిటాచ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మోహన్ కాశ్యే, టెక్నాలజీ ఆఫీసర్ ఎ.రెహమాన్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, శిక్షణ ఫౌండేషన్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ మహాలక్ష్మి, కేఎస్ ఆపరేషన్ మేనేజర్ అప్పారావు, కళాశాల ట్రిబుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ వీఎస్ లవకుశ, అంబేడ్కర్ యూనివర్సిటీ ట్రిపుల్ ఈ విభాగాధిపతి టి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులకు బహుమతుల ప్రదానం



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెం బాలాజీనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనల కచేరీ చూపరులను ఆకట్టుకుంది. ప్రముఖ గాత్ర సంగీత విద్వాంసులు తాతాజీ బృందం పలు కీర్తనలను ఆలపించి శ్రోతలను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. అనంతరం అన్నమాచార్య కీర్తనలకు మహిళల కోలాట ప్రదర్శన చేశారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినం రోజున నిర్వహించిన రాధాకృష్ణుల వేషధారణలు చేసిన బాల, బాలికలకు బహుమతులు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎంవిఎస్.సూర్యభగవాన్ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు చిన్నారులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం రంగాచార్యులు, రాధాకృష్ణమాచార్యులు, భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి మంగళాశాసనం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ భగవాన్, ప్రతినిధులు విజయకుమార్, రమణాజీ, శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ పాటించరా...?

- ప్రారంభోత్సవాలకు మేయర్‌ను ఆహ్వానించకపోవడంపై ఆగ్రహం
- దేవదాయ శాఖ అధికారులకు కార్పొరేషన్ సేవలు అవసరం లేదా..?
- కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేష్
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో 21 అంశాలకు ఆమోదం



మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు, అధికారులు

విజయనగరం: కార్పొరేషన్ అధికారులు ప్రోటోకాల్ పాటించటంలో నిర్లక్ష్యంగా నడుచుకోవటం సరికాదని, నగరంలో జరిగే ప్రారంభోత్సవాలకు మేయర్‌ను ఎందుకు ఆహ్వానించడం లేదని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేష్ మండిపడ్డారు. విజయనగరం ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మవారి పండగ కోసం రూ.60 లక్షల కార్పొరేషన్ నిధులతో ఏర్పాట్లు చేస్తుంటే దేవదాయ శాఖ అధికారులు కనీసం ఆహ్వానించకపోవటాన్ని తప్పుపట్టారు. పండగలో కార్పొరేషన్ సేవలు అవసరం లేకుంటే నిలిపివేస్తామని హెచ్చరించారు. రోడ్లు మరమ్మత్తులు చేసి, నగర సుందరీకరణ, తాగునీటి సౌకర్యాలు కార్పొరేషన్ కల్పిస్తే కనీసం మర్యాద పాటించకపోవటం సరికాదని చెప్పారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. మొత్తం 21 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టగా వాటిపై చర్చించిన సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేష్ మాట్లాడుతూ అధికారులు తీరుపై మండిపడ్డారు. మెప్మా సీవోలను మార్చమని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సీవోల పని తీరు సరిగ్గా లేదన్నారు. సీవోలు సమావేశం పెడితే వచ్చే మహిళలను కిందన కూర్చోబెట్టి అవమానించటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పైడితల్లమ్మ వారి పండగ రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం చేపడుతున్న మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు లేకుండా చేస్తున్నారనే విమర్శ ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించాలని కోరారు. కొత్తగా కొనుగోలు చేసిన రెండు టిప్పర్ వాహనాలను ఏ అవసరాలకు వినియోగిస్తారో కౌన్సిల్ సభ్యులకు తెలియజేయాలన్నారు. విపనకల్ప కాంప్లెక్సు షాపు నిర్మాణానికి టెండర్లు వెంటనే పిలిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాదరావు మాట్లాడుతూ నగరంలో పండగ సందర్భంగా జరుగుతున్న పనులు పురోగతిని వివరించారు. సభ్యులు రేగాన రూపాదేవి మాట్లాడుతూ నగరంలో రోడ్లపై పశు సంచారం అధికంగా ఉందని నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. అల్లు చాణక్య మాట్లాడుతూ తమ వార్డు శ్మశాన వాటికను పరిశీలించి బాగు చేయాలని కోరారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు జివి.రంగారావు, సుంకరి నారాయణస్వామి, అన్ని విభాగాలు అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

- ఏపీఎన్జీవో డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు శ్రీధర్

డెంకాడ: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏపీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. డెంకాడ మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం, పంచాయతీ ఉద్యోగుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. డీఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ ఉద్యోగులు ఈ ఉద్యోగాలకు ఎందుకు వచ్చామా? అని మానసిక ఆవేదన చెందుతున్నారన్నారు. వారికి అంత పని భారాన్ని మోపి మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను రాష్ట్ర అధికారుల దృష్టికి ఏపీ ఎన్జీవో తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఉద్యమబాటకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీవో సంఘం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం భోగాపురం తాలూకా అధ్యక్షుడు కొమ్మూరి దుర్గారావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు అప్పలనాయుడు, పట్టణ కార్యదర్శి ఆనందకుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ఏపీ ఎన్జీవోల సంఘం సభ్యత్వం ఉద్యోగులకు అందజేశారు.

## 'శక్తి'తో మహిళలకు రక్షణ : డీఎస్పీ



విద్యార్థినిలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్ అని జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ గోవిందరావు అన్నారు. విజయనగరం పూల్బాగ్ కాలనీ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థినులకు శక్తి యాప్ పట్ల, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ గోవిందరావు విద్యార్థినులకు (ఎస్.ఓ.ఎస్) మొబైల్ యాప్ ఏ విధంగా డౌన్లోడ్ చేయడం, దాని పని తీరును క్షుణ్ణంగా వివరించారు. మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని, ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్నట్లేనన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్లోని ఎస్.ఓ.ఎస్. బటన్ ప్రెస్ చేస్తే క్షణాల్లో పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకొని, రక్షణగా నిలుస్తారన్నారు. మహిళల భద్రతకు ఈ యాప్లో సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఉందని, మహిళలు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు, ఆటోల్లో ప్రయాణించినపుడు సేఫ్ ట్రావెల్ ఆప్షన్‌పై క్లిక్ చేసి, చేరుకోవాల్సిన ప్రాంతాన్ని నమోదు చేస్తే, వారు సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకొనేంత వరకు వారి ప్రయాణంపై పోలీసులు నిఘా పెడతారన్నారు. ప్రతి పాఠశాలలో చురుకుగా వుండే విద్యార్థులు ఉపాధ్యాయులతో శక్తి వారియర్ టీమ్ ఏర్పాటు చేయాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. విద్యార్థినిలకు విద్యతో పాటు స్వీయ రక్షణ మెలకువలు కూడా నేర్పించాలన్నారు. పాఠశాల ఆవరణలో అమర్చిన సీసీ టీవీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ ఎస్ఐ శిరీష, శక్తి బృందం కానిస్టేబుళ్లు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుకు తప్పని తిప్పలు



సతివాడ రైతు సేవా కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న అన్నదాతలు

- సతివాడలో అరకొరగా పంపిణీ
- నిరాశతో వెనుదిరిగిన రైతులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు మంగళవారం రోజంతా పడిగాపులు కాశారు. యూరియా ఇస్తున్నారన్న సమాచారంతో ఒమ్మి, సతివాడ గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో మంగళవారం వేకువజాము నుంచే లైన్లు కాశారు. పంపిణీ చేసిన సిబ్బంది తీరిగ్గా ఉదయం 11 గంటలకు రావడంతో అంత వరకు కూడా పడిగాపులు కాశారు. వన్‌బీ జెరాక్స్ కాగితాలను దొంతులు పెట్టి మరీ ఎరువుల కోసం గంటల తరబడి నిరీక్షించారు. రెండు గ్రామాల్లో సుమారు 1000 మందికి పైగానే రైతులు ఉండగా కేవలం 250 బస్తాలే పంపిణీ చేయడంతో మిగిలిన రైతులంతా నిరాశతో వెనుదిరిగారు. మిగిలిన రైతులకు ఎరువుల పంపిణీ ఎప్పుడు చేస్తారనేది సిబ్బంది స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి పంటకు యూరియా చాలా అవసరమని, ఆలస్యం చేస్తే పంట ఎందుకూ పనికి రాదని పలువురు రైతులు చర్చించుకున్నారు.

### ఆర్మీ జవానుకు గ్రామస్తుల ఘన సన్మానం



మాజీ ఆర్మీ జవాను అచ్యుతరావును సత్కరిస్తున్న గ్రామ పెద్దలు, యువత

నెల్లిమర్ల రూరల్: భారత ఆర్మీలో సేవలందించి పదవీ విరమణ పొందిన నెల్లిమర్ల మండలం దన్నానపేట గ్రామానికి చెందిన ఆర్మీ జవాను కోరాడ అచ్యుతరావుకు ఘన సన్మానం లభించింది. గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో ఆయనకు మంగళవారం ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ సుదీర్ఘకాలం అచ్యుతరావు ఆర్మీలో పనిచేసి దేశానికి తన వంతుగా సేవలందించారని కొనియాడారు. ఆపరేషన్ సింధూర్‌లో కూడా పాల్గొని కఠినమైన పరిస్థితులను ఎదుర్కొన్నాడని, ప్రస్తుత యువత ఆదర్శంగా తీసు కోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ గేదెల రామచిరంజీవి, మాజీ సర్పంచ్ గేదెల రాజారావు, ఎంపీటీసీ సభ్యుడు తర్లాడ దుర్గారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోరాడ అప్పలనాయుడు, యువత పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయలను పరిరక్షించుకోవాలి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోలగట్ల శ్రావణి

విజయనగరం: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నగర డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి అకాంక్షించారు. నగరంలోని 15వ డివిజన్‌లో వినాయక ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ అల్లు చాణక్యతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియామకమైన కోలగట్ల శ్రావణిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం పని చేయటంలో సంతృప్తి ఉంటుందని చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుంచి స్వస్థ నారీ శక్తి పరివార్



మాట్లాడుతున్న వైద్యాధికారిణి భాగ్యరేఖ

పూసపాటిరేగ: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థనారీ ససక్త్ పరివార్ కార్యక్రమాలు జరగనున్నట్టు రెల్లివలస పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.భాగ్యరేఖ అన్నారు. మంగళవారం మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారీ ససక్త్ కార్యక్రమంపై ఆశాలు, ఏఎన్ఎంలు , ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో కార్యక్రమం నిర్వహణ, చేపట్టాల్సిన అంశాలు, చర్యలపై అవగాహన కల్పించారు. డెప్యూటి హెచ్‌ఈవో శివ, ఎంపీహెచ్‌ఈవో రమణమూర్తి, హెచ్‌వి లలిత, ఎంపీహెచ్ఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

**డెంకాడలో..**

డెంకాడ: ఈ నెల 17వ తేదీ నుంచి స్వస్థనారి పరివార్ కార్యక్రమం ప్రారంభమౌతుందని డెంకాడ పీహెచ్‌సీ డాక్టర్ ఎం.శివరామకృష్ణ తెలిపారు. డెంకాడ పీహెచ్‌సీ పరిధిలో అక్కివరం గ్రామం నుంచి వైద్య శిబిరాలు ప్రారంభిస్తామన్నారు. మహిళల్లో ఎక్కువగా రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేయడం జరుగుతుందని వివరించారు. కిశోర్ బాలికలకు ఆరోగ్య పరీక్షలు, టీబీ వ్యాధి స్క్రీనింగ్, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, మానసిక వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. మానసిక వైద్య సేవలు, ఆయుష్ తదితర వైద్య సేవలు స్పెషలిస్ట్ వైద్యులతో శిబిరంలో సేవలు అందిస్తామన్నారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శివరామకృష్ణ కోరారు.

# ఓజోన్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మలిచర్ల జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థుల ఓజోన్ 3 ఆకృతి ప్రదర్శన



డెంకాడ: జొన్నాడ ఉన్నత పాఠశాలలో ఓజోన్ డే సందర్భంగా ఓ3 ఆకృతిలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం చేపట్టిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. తొలిత విద్యార్థులు మలిచర్ల గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ ద్వారా పిల్లలకు, గ్రామస్తులకు ఓజోన్ పొర ప్రాధాన్యతను వివరించారు. అనంతరం పాఠశాల క్రీడా మైదానంలో ఓజోన్ 3 ఆకృతిలో విద్యార్థులు కూర్చొని ప్రదర్శించి గ్రామస్తులను ఆకట్టుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం జి.సుజాత పర్యవేక్షణలో సైన్ ఉపాధ్యాయుడు కాకినాడ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

**గురజాడలో ఓజోన్ పరిరక్షణపై చిత్రలేఖన పోటీలు**

గురజాడ పాఠశాలలో మంగళవారం జరిగిన ఓజోన్ దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు చిత్రలేఖన పోటీలను చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరయిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ సరిత చేతుల మీదుగా విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎంఆర్ కళాశాలలో...**

మహారాజా అటానమస్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అరవిందో కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ పిన్నింటి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఓజోన్ పొరను కాపాడుకోవడం మానవాళి సమష్టి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా ఓజోన్ పరిక్షణ అంశాలపై వీడియో చిత్రప్రదర్శన ద్వారా తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.సుధ, ఐక్యూఏసీ కోర్డినేటర్ డాక్టర్ పి.అచ్చుతరావు, సీజీసీ కో ఆర్డినేటర్ పి.రాజు, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**జొన్నాడ ఉన్నత పాఠశాలలో..**

డెంకాడ: జొన్నాడ జెడ్పీ హైస్కూల్ లో ఓజోన్ డే జరిగింది. స్వచ్ఛ పక్వాడ 2025 అంతర్జాతీయ ఓజోన్ డేలో భాగంగా విద్యార్థులు ఓజోన్ ఓ3 ఆకృతిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జి.లక్ష్మి మాట్లాడుతూ ఓజోన్ పొర ప్రాధాన్యత, పరిరక్షణపై విద్యార్థులకు వివరించారు.

## బొత్సను కలిసిన కోలగట్ల శ్రావణి



మాజీ మంత్రి, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను విశాఖపట్నంలో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం అందుకుంటున్న కోలగట్ల శ్రావణి

విజయనగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన సందర్భంగా కోలగట్ల శ్రావణి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను విశాఖపట్నంలో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణికి బొత్స శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి నివాసంలో శ్రావణి మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనమండలి సభ్యురాలు శ్రావణికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ మహిళా పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి చేయటంలో మహిళలు ముఖ్య పాత్ర పోషించాలని, దీనికి కార్యాచరణ చాలా ముఖ్యమని ఆమె అన్నారు.

### కాంచనకు సేవారత్న అవార్డు

విజయనగరం టౌన్: పట్టణానికి చెందిన అన్నదాత సుఖీభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు కాంచనకు మదర్ థెరీసా సర్వీస్ సొసైటీ వారి సేవారత్న అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం గురువారం ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు కళాకేంద్రం ప్రాంగణంలో సొసైటీ మూడో వార్షికోత్సవ వేడుకలలో తనకు అవార్డు అందజేశారన్నారు.

### రోడ్ల మరమ్మతులకు శంకుస్థాపన

భోగాపురం: మండలంలోని కొన్ని గ్రామాలకు వెళ్లే గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఏ దారి చూసిన చూసిన అడుగుకో గుంత.. గజానికో గొయ్యి మాదిరి కనిపిస్తున్నాయి. దీనిపై గతంలో సాక్షి దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురించడంతో ఎట్టకేలకు స్పందిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి సుమారు రూ.3 కోట్లు నాబార్డు నిధులతో రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ముక్కాం ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి తోటపల్లి, బోయపాలెం, ఎర్రముసలయ్యపాలెం మీదుగా చేపలకంచేరు వెళ్లే రోడ్డు, రెడ్డికంచేరు నుంచి కొంగవానిపాలెం మీదుగా ముంజేరు వెళ్లే రోడ్డు, భోగాపురం జాతీయ రహదారి నుంచి చాకివలస గ్రామానికి వెళ్లే రోడ్ల మరమ్మతుల పనులకు ఎమ్మెల్యే నాగమాధవి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉడికల అప్పయ్యమ్మ, నాయకులు వందనాల రమణ, పడాల శ్రీనివాసరావు, బొల్లు త్రినాద్, పి జగదీష్, పి రాంబబు, కె శ్రీనివాస్ వరుపుల గిరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను సంరక్షించాలి

భోగాపురం: ప్రభుత్వ భూములను సంరక్షించాలని చాకివలస గ్రామ ప్రజలు, జిల్లా సీసీఆర్ సభ్యులు మంగళవారం డిమాండ్ చేశారు. మండలంలోని చాకివలస రెవిన్యూ పరిధిలో ఎల్‌పీ నంబర్ 951పై గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిపై జరుగుతున్న అక్రమ అనధికార నిర్మాణాలు ప్రజల దృష్టికి వచ్చాయని, ప్రభుత్వ భూమి ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే వియోగించాలని, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమించడం చట్ట విరుద్ధమన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని రక్షించాలని గ్రామ ప్రజలు, జిల్లా కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. స్థానికులు ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ అధికారులకు సమాచారం అందిచాలని సీసీఆర్ సభ్యులు కోరారు.



చాకివలస రెవెన్యూ పరిధిలో అక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి